క్లుప్తంగా

పాడి రైతులకు జొన్న విత్తనాల పంపిణీ



నాగాయలంక: మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యాన స్థానిక పశువైద్యశాల ఆవరణలో శుక్రవారం పాడి రైతులకు జొన్నవిత్తనాల కిట్లను జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి(డీఎంహెచ్ఓ) డాక్టర్ చిన నరసింహులు పంపిణీ చేశారు. స్థానిక పశువైద్యాధికారిణి డాక్టర్ సాయిమౌనిక మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో వెయ్యి కిలోల జొన్నలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఐదు కేజీల కిట్‌ను సబ్సిడీపై రూ. 115లకే అందిస్తున్నామని చెప్పారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ప్రశాంతంగా ఈఏపీసెట్ పరీక్ష

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏపీ ఈఏపీసెట్ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లలో కలిపి 354 మంది విద్యార్థులకు గాను 344 మంది హాజరయ్యారని, పది మంది గైర్హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి, అడ్మిన్ అశోక్‌కుమార్ తెలిపారు.

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

పెడన: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశం హాలులో జరిగే ఈ కార్యక్రమంలో అజెండాలోని 35 అంశాలపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు. కౌన్సిల్, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, సంబంధిత విభాగాధిపతులు హాజరు కావాలని ఆమె కోరారు.

రేషన్ పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు

పెడన: రేషన్ పంపిణీలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పెడన ఇన్‌ఛార్జి తహసీల్దారు కే అనిల్‌కుమార్ హెచ్చరించారు. పట్టణంతోపాటు మండలంలోని రేషన్‌దుకాణాల డీలర్లతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు రేషన్ దుకాణాలను ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తెరిచి రేషన్ ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వృద్ధులు, వికలాంగులకు వారి ఇళ్లకు వెళ్లి రేషన్ ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఆర్ఐ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల రేషన్ డీలర్లతో శుక్రవారం గూడూరు తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డీలర్లు చివరి లబ్ధిదారుడికి కూడా సక్రమంగా సరుకులు పంపిణీ అయ్యేలా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ కే సాయి, ఆర్ఐ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

నీటి పన్నులు వేగవంతం చేయండి

నాగాయలంక: మండలంలో నీటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని స్థానిక తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాథ్ గ్రామ రెవిన్యూ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నాగాయలంక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. మండలంలో నీటి తీరువా మొత్తం రూ. 2,17,69,666 వసూలు చేయాల్సి ఉందని, ఈ వారపు లక్ష్యంగా రూ. 36,28,278 నిర్దేశించడం జరిగిందని వివరించారు. సమావేశంలో డీటీ అబ్దుల్ రఫీ, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చిన్నారులకు వేసవి శిక్షణ తరగతులు



పామర్రు: వేసవి సెలవులను చిన్నారులు సద్వినియోగం చేసుకునే విధంగా వారికి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల పేర్కొన్నారు. స్థానిక విజన్ లైఫ్ సెంటర్‌లో శుక్రవారం చిన్నారులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులను ఎంపిక చేసి, వారికి పలు అంశాల్లో శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో పీటర్ సాల్మన్, కె శామ్యూల్ పాల్గొన్నారు.

అన్నసమారాధన

చల్లపల్లి: స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమత్ జయంతి సందర్భంగా శుక్రవారం 2,500 మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నసమారాధన కార్యక్రమాలను పర్యవేక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

సమస్తం.. మద్యం సీసాలమయం!


- మద్యం సీసాల డంపింగ్ యార్డులా పంటపొలాలు, ఖాళీ స్థలాలు
- ఇబ్బందులు పడుతున్న సామాన్యులు



చల్లపల్లి నారాయణరావునగర్ కాలనీలో చెరువు గట్టుపై మద్యం సీసాలు



లక్ష్మీపురం జల్సా వైన్ షాపు వెనుక పంట పొలాల్లో మద్యం సీసాలు



గురుకుల పాఠశాల వద్ద ఉన్న చెరువు గట్టుపై పగులకొట్టిన మద్యం సీసాలు

చల్లపల్లి: అగ్గిపుల్ల, కుక్కపిల్ల, సబ్బు బిళ్ల కాదేదీ కవితకు అనర్హం అన్నారు శ్రీశ్రీ. చెరువు గట్టు, పొలం గట్టు, కాలువ గట్టు కాదేది మద్యం సేవించేందుకు అనర్హం అంటున్నారు మందుబాబులు. గత ప్రభుత్వ హయాంలో ఊరి నుంచి వెలివేసినట్లుగా గ్రామాల చివరన ఉన్న మద్యం షాపులు కూటమి ప్రభుత్వం పుణ్యమా అని జనావాసాల మధ్యకు వచ్చి చేరాయి. దీంతో నిత్యం తూలుతున్న మందుబాబులతో... బడి, గుడి, బస్టాండుతో సహా సర్వం మద్యం సీసాలతో దర్శనమిస్తుండటంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రాత్రయితే చాలు

చల్లపల్లి నారాయణరావునగర్‌లోని బాలికల గురుకుల పాఠశాల వద్ద ఉన్న చెరువు గట్టుపై రాత్రయితే చాలు ఆకతాయిలంతా చేరుతున్నారు. అర్ధరాత్రి వరకూ గుంపులుగా కూర్చొని మద్యం సేవించడంతో ఆ మార్గంలో తమ ఇళ్లకు బిక్కుబిక్కుమంటూ వెళుతున్నామని స్థానిక జగనన్న కాలనీ మహిళలు పేర్కొంటున్నారు. గట్టిగా కేకలు పెడుతూ మద్యం సీసాలను పగలగొట్టి భయాందోళనలకు గురిచేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. కొందరైతే ఇక్కడ ఏకంగా గురుకుల పాఠశాల గోడలు కూడా దూకుతున్నారని సమాచారం.

గతంలో వృద్ధురాలిపై దాడి

గురుకుల పాఠశాల వద్ద గతంలో కొందరు మందుబాబులు ఈ ప్రాంతంలోనే నివాసం ఉంటున్న ఓ ఒంటరి వృద్ధురాలిపై దాడి చేసి గాయపరిచి ఆమె వద్ద నుంచి నగదు అపహరించారని స్థానికులు చెపుతున్నారు. మద్యానికి బానిసలై తాగేందుకు చేతిలో డబ్బు లేక ఇలా కొందరు దాడులకు పాల్పడిన ఘటనలు గతంలో జరిగాయని మరలా ఈ తాగుబోతు మూకలు ఎవరింటిపై పడతారోనని భయం వేస్తోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

పశువులకు గాయాలు

216 జాతీయ రహదారిపై చల్లపల్లి మండలం రామానగరం అడ్డరోడ్డు వద్ద ఉన్న గుండేరు డ్రెయిన్‌లో నిత్యం అట్టపెట్టెలతో మద్యం సీసాలు తీసుకువచ్చి వంతెన వద్ద బండిరేవు కోడులో పడేసి వెళ్లిపోతున్నారు. దీంతో కోడు మొత్తం మద్యం సీసాలతో నిండిపోవడంతో అవి పగిలి కాలువలో దిగిన తమ పశువులకు గాయాలు చేస్తున్నాయని పశుకాపరులు గగ్గోలు పెడుతున్నారు.

పంట పొలాల్లో..

మండల పరిధిలోని జల్సా వైన్స్ వెనుక వైపున ఉన్న పంట పొలాలు నిత్యం ఖాళీ మద్యం సీసాలతో నిండిపోతున్నాయి. దీంతో ఆయా ప్రాంత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడెక్కడివారో ఇక్కడికి వచ్చి పొలాల్లో కూర్చొని మద్యం సేవిస్తున్నారని అదేమని అడిగితే తాగిన మైకంలో మీదకు వచ్చి దౌర్జన్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారి జోలికి వెళ్లాలంటేనే భయంగా ఉంటోందని పలువురు రైతులు వాపోతున్నారు. ప్రతిరోజూ పొలంలో ఉన్న ఖాళీ మద్యం సీసాలను ఏరలేక నానా ఇబ్బందులు పడుతున్నామని గగ్గోలు పెడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు బాటిళ్లు నేలలో పూడుకుపోవడం వల్ల పొలం దుక్కులు సమయంలో పగిలి వ్యవసాయ పనుల్లో పాల్గొనే కూలీలు, రైతులకు గాయాలు చేస్తున్నాయని వాపోతున్నారు.

దివ్యాంగ విద్యార్థుల నమోదు సర్వే పరిశీలన



దివ్యాంగ విద్యార్థిని పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష అధికారులు రాంబాబు, నగేష్

గూడూరు: మండల పరిధిలో నిర్వహిస్తున్న ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల నమోదు సర్వేను సమగ్ర శిక్ష జిల్లా ఐఈ కోఆర్డీనేటర్ ఎస్ రాంబాబు శుక్రవారం పరిశీలించారు. రామరాజుపాలెంలో ఇంటింటి సర్వేలో పాల్గొన్న రాంబాబు దివ్యాంగులకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఈఆర్పీలు గత పది రోజులుగా ఆరు నుంచి 18 ఏళ్ల వయసు గల ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగుల గుర్తింపు సర్వే నిర్వహిస్తోందని తెలిపారు. తద్వారా వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం సర్వే నిర్వహిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎస్ఓ డీ నగేష్, రిసోర్స్ పర్సన్ సజని బేగం తదితరులు పాల్గొన్నారు.

సమగ్రంగా దివ్యాంగ విద్యార్థుల సర్వే

పెడన: ఆరు నుంచి 18 ఏళ్ల వయసు గల దివ్యాంగ(ప్రత్యేక అవసరాలు గల) విద్యార్థుల సర్వే సమగ్రంగా చేయాలని సమగ్ర శిక్ష సహిత విద్య కోఆర్డినేటర్ ఎస్ రాంబాబు సూచించారు. శుక్రవారం ఆయన ఎస్‌వోడీ నగేష్‌తో కలిసి పెడనలో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులను పాఠశాలల్లో నమోదు కావాలనే లక్ష్యంతో సమగ్ర శిక్ష అడుగులు వేస్తోందని అన్నారు. పెడన మండలంలో ఇప్పటి వరకు వివిధ పాఠశాలల్లో దాదాపు 100 మంది దివ్యాంగ విద్యార్థులు యూ డైస్‌లో నమోదు అయ్యారని తెలిపారు. గత 10 రోజులుగా నిర్వహిస్తున్న ఈ సర్వేలో ఇప్పటివరకు ఐదు మంది విద్యార్థులను గుర్తించారని, ఇంకా ఎవరైనా బడి మానేసిన లేదా బడిబయట ఉన్న లేదా ఐదు ఏళ్లు పూర్తయిన దివ్యాంగ విద్యార్థులు ఉంటే వెంటనే వారిని బడి బాట పట్టించాలని కోరారు. సర్వేలో సహిత విద్యా రిసోర్స్ పర్సన్ రమ్య, అబ్దుల్ హమీద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పుష్పార్చన



పుష్పాలంకారంలో ఉత్సవమూర్తులు

బంటుమిల్లి: పెద్దాపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీసువర్చలాంజనేయస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులకు పలు రకాల పుష్పాలతో పుష్పార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హనుమజ్జయంతి ఉత్సవాల ముగింపులో భాగంగా గురువారం రాత్రి పండితులు డీవీ మేఘనరసింహాచార్యులు, రొంపిచర్ల హనుమంతాచార్యులు శిష్య బృందం వేద మంత్రాల మధ్య పుష్పార్చన వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మేళతాళాలు, భక్తులు పాడిన భక్తి గీతాలాపనతో పూజలను నిర్వహించారు. హనుమాన్ నామస్మరణతో ఆలయం మారుమోగింది. అనంతరం గత 47 రోజులుగా హనుమాన్ చాలీసా పారాయణలో పాల్గొన్న భక్తులకు పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అలాగే హనుమంతాచార్యులు దంపతులు, మేఘనరసింహాచార్యులు బృందాన్ని భక్తులు శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, హిందూ శోభాయాత్ర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నిర్మిస్తుండగానే కుంగుతున్న రహదారి



బీటలు వారిన కోడూరు - అవనిగడ్డ రహదారి మార్జిన్

కోడూరు: కోడూరు - అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మిస్తుండగానే కుంగిపోయి మార్జిన్లు విరిగిపోవడంతో పనుల నాణ్యతపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ రహదారిని నిర్మించింది. అయితే అప్పట్లో నాణ్యత పాటించకపోవడంతో రహదారి నిర్మించిన ఆరు నెలల్లో ధ్వంసమై శిథిలావస్థకు చేరింది. దీంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ రహదారి నిర్మాణానికి రూ. 16.5కోట్లు నిధులు కేటాయించి, 50శాతం పైగా పనులు పూర్తి చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మాణ పనులు నిలిచిపోయాయి. రహదారి పనులను మధ్యలో నిలిపివేయడంతో ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవ్వడంతో రెండు నెలల క్రితం పనులు ప్రారంభించారు.

పనుల్లో కనిపించని నాణ్యత

ప్రస్తుతం కోడూరు - అవనిగడ్డ ప్రధాన రహదారి పనులు తుదిదశకు చేరుకున్నాయి. రహదారి నిర్మిస్తున్న కాంట్రాక్టర్ పనుల్లో నాణ్యత పాటించడం లేదని ప్రజలు వాపోతున్నారు. పనులను నాసిరకంగా చేయడంతో జయపురం - వి.కొత్తపాలెం మధ్య రహదారి కుంగిపోయింది. మార్జిన్ బీటలు వారడంతో పాటు రహదారి అంచులు కూడా కుంగిపోతున్నాయి. మార్జిన్‌లో రబ్బీసు వేయకుండా నల్లమట్టి వేయడంతో రహదారి దెబ్బతింటుందని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రహదారి పనుల్లో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన సింహాద్రి



కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన విజయకుమార్ - లహరిల వివాహం కావడంతో నూతన వధూవరులను మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆశీర్వదించారు. లింగారెడ్డిపాలెంలో శుక్రవారం జరిగిన రిసెప్షన్ వేడుకల్లో రమేష్‌బాబు పాల్గొన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నేతలు బడే సూర్యనారాయణ, మాలే నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగితో చాకిరి



జిల్లా అధికారి కారు కడుగుతున్న మహిళా ఉద్యోగి

మచిలీపట్నంఅర్బన్: స్థానిక క్షయ వ్యాధి నిర్మూలన జిల్లా కేంద్రంలో ఓ ఉన్నతాధికారి అధికార దుర్వినియోగం చేస్తూ అదే కార్యాలయంలో పనిచేస్తున్న ఒక మహిళా ఉద్యోగితో తన వ్యక్తిగత కారును రోజూ కడిగించుకుంటున్నారు. ఆ అధికారికి రెండు కార్లు ఉన్నాయని తను ఏ కారులో కార్యాలయానికి వస్తే దానిని శుభ్రంగా కడగాలని మహిళా అటెండర్‌కు ఆదేశాలు జారీ చేస్తున్నారని ఉద్యోగవర్గాలు చెబుతున్నాయి. దీన్ని స్థానికులు, ఉద్యోగులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న జిల్లా అధికారిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

చోరంపూడిలో వైద్య పరీక్షలు

సాక్షి ఎఫెక్ట్..



చోరంపూడి గ్రామంలో స్థానికులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

బంటుమిల్లి: మండల పరిధిలోని చోరంపూడి గ్రామంలో శుక్రవారం పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. 'వైరల్ జ్వరాలతో గ్రామస్తులు ఆందోళన' కథనం సాక్షిలో శుక్రవారం వెలువడింది. దీనిపై స్పందించిన పెదతుమ్మిడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కే సువర్చల ఆధ్వర్యంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గ్రామంలో ఇంటింటికీ తిరిగి రక్త పరీక్షలు చేశారు. అనుమానితుల నుంచి సేకరించిన రక్తాన్ని మచిలీపట్నం ప్రభుత్వ రక్త పరీక్ష కేంద్రానికి పంపారు. అలాగే నీరు నిలువ ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణ మందులు పిచికారి చేశారు. కార్యక్రమంలో మచిలీపట్నం సబ్ యూనిట్ ఆఫీసర్ పీ మురళీ, సూపర్‌వైజరు ఏసుదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి



ఘంటసాల: యోగాంధ్ర కార్యక్రమాన్ని అధికారులందరూ సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని ఎంపీడీవో డి.సుబ్బారావు పేర్కొన్నారు. ఈ మేరకు ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం విలేజ్ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామస్థాయిలో చేపట్టాల్సిన అంశాలను వివరించారు. విలేజ్ కమిటీలు ప్రతి ఇంటి నుంచి యోగాలో పాల్గొనేలా ప్రజలను ప్రోత్సహించి వారి పేర్లను నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ బీ విజయప్రసాద్, డెప్యూటీ ఎంపీడీవో కే వెంకటేశ్వరరావు, ఘంటసాల పీహెచ్‌సీ డాక్టర్ వేమూరి ప్రమోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మద్యం వ్యాపారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఎక్సైజ్ సూపరింటెండెంట్ గంగాధరరావు



మచిలీపట్నంలో ఓ బార్‌ను తనిఖీ చేస్తున్న ఈఎస్ గంగాధరరావు

కోనేరుసెంటర్: మద్యం వ్యాపారులు నిబంధనలను అతిక్రమించి విక్రయాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని మచిలీపట్నం ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీ గంగాధరరావు హెచ్చరించారు. గురువారం రాత్రి ఆయన మచిలీపట్నంలోని మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైన్‌షాపుల తోపాటు నగరంలోని బార్ అండ్ రెస్టారెంట్లను తనిఖీ చేసి వ్యాపారులు సమయపాలన పాటిస్తున్నదీ లేనిదీ పరిశీలించారు. బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులు పలు హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాపారులు ఎక్సైజ్ నిబంధనలకు లోబడి సమయపాలన పాటించి విక్రయాలు చేసుకోవాలన్నారు. లూజు సేల్స్ జరిపినట్లు తెలిస్తే సంబంధిత షాపులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అర్ధరాత్రి అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిస్తే సంబంధిత సమాచారాన్ని తమకు తెలియజేయాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. తనిఖీల్లో మచిలీపట్నం ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మినీ మహానాడు రోజున ఎన్టీఆర్‌ను మరిచారు



పూలమాలకు కూడా నోచుకోని బస్టాండ్ సెంటరులోని ఎన్టీఆర్ విగ్రహం

మచిలీపట్నంటౌన్: టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావును ఆ పార్టీ నాయకులు విస్మరించారు. జిల్లా స్థాయి మినీ మహానాడు కార్యక్రమాన్ని నగర శివారులోని ఓ కల్యాణ మండపంలో శుక్రవారం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని బస్టాండ్ సెంటరులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి కనీసం పూలమాల కూడా వేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. మినీ మహానాడులో రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తదితర నాయకులు హాజరై ఎన్టీఆర్ స్థాపించిన పార్టీ అంటూ ఉపన్యాసాలు చేశారు. కాని నగరంలోని ఆయన విగ్రహానికి నివాళులర్పించకపోవడంపై ఆ పార్టీ కార్యకర్తలు విస్మయం చెందుతున్నారు.

ఒకటి నుంచి పండిత సభలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని బలరామునిపేటలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారి దేవస్థానం(యతిరాజ భవనం)లో వచ్చేనెల నుంచి మూడవ తేదీ వరకు శ్రీ ఉభయ వేదాంత పండిత సభలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. మూడురోజులపాటు వివిధ ప్రాంతాల పండితులు పలు అంశాలపై ఉపన్యాసాలు ఇస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా దివీస్ ల్యాబరేటరీస్ లిమిటెడ్ ఎండీ డాక్టర్ దివి మురళీకృష్ణ ప్రసాద్ హాజరవుతారని తెలిపారు.

విద్యతో బంగారు భవిష్యత్తు



బంటుమిల్లిలో మాట్లాడుతున్న సీడీపీఓ సముద్రవేణి

బంటుమిల్లి: బాలికల బంగారు భవిష్యత్తుకు చదువు ఒక్కటే మార్గమని బంటుమిల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఎం. సముద్రవేణి పేర్కొన్నారు. స్థానిక కొత్త హరిజనవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలికలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు ఎస్ నాగలక్ష్మి, డీసీపీఓ సీహెచ్ గంగాభవాని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలి

గూడూరు: కిశోర బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని మల్లవోలు సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జన్ను రేవతి సూచించారు. కిశోరి వికాసంలో భాగంగా మల్లవోలు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలి

ఘంటసాల: ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని ఏపీ పౌరహక్కుల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు జక్కా కేశవరావు డిమాండ్ చేశారు. ఘంటసాల గోటకం కాలనీలో జక్కా కేశవరావు శుక్రవారం మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ అడవుల్లో సీపీఐ ఎమ్ఎల్ మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా 27 మందిని బుధవారం బూటకపు ఎన్‌కౌంటర్ చేసి చంపించారని ఆరోపించారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌ను ఆయన తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

రెసిడెన్షియల్ పాఠశాలకు విద్యార్థిని ఎంపిక



ఆశ్రిత

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థిని యడవల్లి ఆశ్రిత ఏపీ గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టరు కే కిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆశ్రిత నాలుగో తరగతిలో చేరేందుకు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలోని నిమ్మకూరు, ముసునూరు పాఠశాలల్లో అడ్మిషన్ పొందేందుకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలో సీటు సాధించిన ఆశ్రితను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను డైరెక్టరు కిషోర్, తల్లిదండ్రులు అభినందించారు.

145 మందికి హోమియో వైద్య పరీక్షలు

బంటుమిల్లి: స్థానిక కాంతి కేంద్రం సేవా ట్రస్ట్ భవనంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో 145 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో గుడివాడ ప్రభుత్వ గురురాజు హోమియో వైద్యశాల వైద్యులు లక్ష్మి ఆధ్వర్యంలో జూనియర్ వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో నిర్వాహకులు రమణ, ఆంజనేయులు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన రోగులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి ఆలయ ప్రతిష్ట



పామర్రు: స్థానిక సోమేశ్వరస్వామి ఆలయం పక్కన నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయ శిఖర, విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో చతురస్థావరచనలు, గర్తన్యాసం, రత్నన్యాసం చేసి అనంతరం ఉదయం 7.41 గంటలకు నూతన ఆలయ శిఖర విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి చేసి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. ఆలయంలో చలమచర్ల మురళీ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాతలు తాడిశెట్టి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం భార్య విజయలక్ష్మి, కుమారులు సత్యనారాయణ ఉషారాణి, మధు దివ్యభారతిల సౌజన్యంతో విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలను జరిపించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఆలయ వ్యవస్థాపకులైన తాడిశెట్టి బశివరావు, పద్మజ, సత్యనారాయణ ఉషారాణి, మధుశేఖర్ దివ్యభారతి, తాడిశెట్టి సతీష్ పావని, గురుస్వాములు వల్లూరిపల్లి చక్రవర్తి, బొగ్గరపు సాయిబాబు, మాగంటి వెంకటరత్నం, నాని గురుస్వామి, కలకండ అంజిబాబు, స్వర్ణ శివ, తాడిశెట్టి కుమార్ పాల్గొన్నారు.